క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆదిశంకరాచార్య విగ్రహం ఏర్పాటు


ఆచంట రామేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన శంకరాచార్య విగ్రహం

పెనుగొండ: ఆచంటేశ్వరుని ఆలయంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహావిష్కరణ అత్యంత వైభవంగా ఆవిష్కరించారు. మృత్యుంజయ సొసైటీ మాజీ అధ్యక్షురాలు, దివంగత వైట్ల శారదా దేవి జ్ఞాపకార్థం వారి కుమారుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో బాలిన వీరాస్వామి, మనవర్తి శ్రీను, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బీచ్‌లో సందర్శకుల సందడి


కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

మెరుగైన సమాజం కోసం వచ్చిందే 'కదలిక'


కదలిక సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వక్తలు

నరసాపురం రూరల్: సమకాలీన సమాజంలో పలు అంశాలపై అవగాహనను కల్పించడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణం చేపట్టేందుకు పుట్టిందే కదలిక అని పలువరు పలువురు వక్తలు పేర్కొన్నారు. వైయన్ కళాశాల పీజీ సెమినార్ హాలులో ఆదివారం జరిగిన కదలిక సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద రాజేష్, మానస స్పీకర్ ఎంపీ జానకీరామ్ తదితరులు మాట్లాడుతూ కొప్పర్రు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే తీసుకు వచ్చిన ఈ కదలిక నవ సమాజానికి నాంది కావాలన్నారు. కార్యక్రమంలో వైఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు, రాష్ట్ర ఏఐటీయూసి నాయకులు నెక్కంటి సుబ్బారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎస్ వర్మ, శ్రీవల్లి పాల్గొన్నారు.

ఈ-పంట గంట మోగేనంట..!

- గ్రామాల్లో జోరుగా ఈ-పంట నమోదు
- ఈ-పంట ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


యలమంచిలిలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి

యలమంచిలి: రైతులకు ఈ-పంట నమోదుకు సమయం ఆసన్నమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు. విత్తనాల ఎంపిక నుంచి పండించిన పంట మార్కెట్‌కు తరలించే వరకు అన్నదాతలకు అవసరమైన అన్ని రకాల సేవలు, సహాయం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు ఏర్పడిన సమయంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ-పంట నమోదు విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానంలో రైతులు ఏ విధమైన పంట, ఎంత విస్తీర్ణంలో పండించారో? స్పష్టంగా నమోదు చేస్తారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు.

పంట నమోదులో మరింత పారదర్శకత..

ఈ-పంట నమోదు ఏటా జరుగుతున్నా ప్రభుత్వం ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదులో మరింత పారదర్శకత తీసుకొచ్చింది. పంట నమోదు యాప్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చారు. ఈ విధానంలో రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. ఊడ్పులు పూర్తవ్వగానే ఆధార్, పంట రకం, విత్తిన తేదీ వివరాలను కొత్త యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం యాప్‌లో నమోదు చేసిన ప్రతి సర్వే నెంబర్ దగ్గరకు వెళ్లి జియో కార్డినేట్స్ ద్వారా ఫొటో తీస్తారు. ఈ విధంగా రైతులు పంట నమోదు సక్రమంగా చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందుతాయి.

రైతులకు అందే ప్రయోజనాలు..

రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయించుకోవడం వల్ల పంటల భీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ-క్రాప్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు. దీంతో పంట అమ్మే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుంది.

ఉచితంగా ప్రీమియం

ప్రకృతి వైపరీత్యాలుఏర్పడి పంట దెబ్బతింటే పరిహారం రావాలంటే రైతులు ఇన్సూరెన్స్ చెల్లించాలి. కానీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తూ రైతులపై ఆ భారం లేకుండాచేసింది. ఇన్ని ప్రయోజనాలు కలిగిస్తున్న ఈ-పంటను రైతులంతా ముందుకువచ్చి నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

వేగంగా ఈ-క్రాప్ నమోదు



రైతులకు ఎంతో మేలు చేసే ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వేగంగా చేస్తున్నాం. ఈ-క్రాప్ నమోదు చేయడానికి గ్రామ వ్యవసాయ సహాయకులు పంట పొలం వద్దకువెళ్లి భూమి సర్వేనెంబరు, ఏ పంట సాగు చేశారు? ఎంత విస్తీర్ణం? ఏ తేదీన నాట్లు వేశారు? తదితర వివరాలన్నీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. విత్తు నుంచి విక్రయం వరకు మేలు చేసే ఈ-పంట నమోదును రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– చిండులూరి దేవి, వ్యవసాయాధికారి, యలమంచిలి

రైతులకు ఎంతో ప్రయోజనం



ఈ-పంట నమోదు కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అందుతుంది. ప్రకృతి విపత్తుల వలన పంట దెబ్బతిన్నా రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా నష్ట పరిహారం సాగు చేసే రైతు ఖాతాలో నేరుగా జమవుతుంది. కౌలు రైతులకు ఈ-పంట నమోదు వలన మరింత ప్రయోజనం చేకూరుతుంది.

– బొంతు వెంకట కర్ణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్, యలమంచిలి

పోలీసు ఉద్యోగాల కోసం కసరత్తు


శిక్షణ పొందుతున్న ఎస్సై అభ్యర్థులు

నరసాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల నియామకాలకు సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తుంది. ఇప్పటికే కానిస్టేబుల్, ఎస్సై రాత పరీక్షలకు సంబంధించిన తొలి విడత రాత పరీక్ష నిర్వహించింది. ఈ రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల్లో ఎస్సై అభ్యర్థులకు సంబంధించి ఈ నెల 25 నుంచి ఈవెంట్స్ సెలక్షన్స్ ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా క్రీడా మైదానాల్లో ఆయా అభ్యర్థులు ప్రాక్టీస్‌ను వేగవంతం చేశారు. నరసాపురం వైఎన్ కళాశాల క్రీడా ప్రాంగణలో పోలీసు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 50 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకుంటున్నారు. మొగల్తూరు మండలానికి చెందిన ఓ నేషనల్ అథ్లెట్ మణికంఠ నేతృత్వంలో వీరంతా వారికి అవసరమైన వివిధ అంశాలపై శిక్షణను తీసుకుంటున్నారు. వీరిలో పట్టభద్రులైన యువకులతోపాటు ప్రస్తుతం పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారు, మహిళలు సైతం ఉన్నారు. సుమారు నెల రోజులుగా ఉదయం సాయంత్రం వేళల్లో క్రీడా ప్రాంగణమంతా వీరి ప్రాక్టీస్‌తో సందడి నెలకొంది.

శ్రీకృష్ణాష్టమి వేడుకల కరపత్రం విడుదల


శ్రీకృష్ణాష్టమి వేడుకల కరపత్రాన్ని విడుదల చేసిన మేకా శేషుబాబు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కెనాల్ రోడ్డు ఎర్రవంతెన వద్ద కొలువై ఉన్న శ్రీ కృష్ణ ఆలయంలో సెప్టెంబర్ 6న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు చేతులమీదుగా స్వామివారి ఉత్సవ కరపత్రాలను విడుదల చేశారు. శేషుబాబు మాట్లాడుతూ శ్రీకృష్ణ ఆలయం నూతనంగా నిర్మాణం చేసిన నాటి నుంచి స్వామివారి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతీ నెలా స్వామివారి జన్మనక్షత్రం రోజున అభిషేకాలు, కృష్ణాష్టమి వంటి ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మన్నే శ్రీనివాస్, సెక్రటరీ ఇయ్యపు భాస్కరరావు, ట్రెజరర్ ముగడ శ్రీనివాస్, వైఎస్సార్‌పార్టీ నాయకులు పెచ్చెట్టి కోటేశ్వరరావు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జోరు


గుడిమెట్ల వెంకట రెడ్డి


విశ్వనాథం పేరయ్య


కటికెల ధనలక్ష్మి


కప్పల అనంతలక్ష్మి


కొప్పినీడి కృష్ణవేణి


అంగర రామలక్ష్మి


పీతల యామిని దుర్గా చంద్రకళ

పెనుగొండ: ఉప ఎన్నికల్లో ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సత్తా చాటుకొంది. మూడు పంచాయతీల్లో వార్డు సభ్యులకు జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలను వైఎస్సార్ సీపీ సాధించుకొని సత్తా చాటింది. ఒక వార్డును టీడీపీ నిలబెట్టుకొంది. పెనుమంట్ర మండలంలో వెలగలేరు 7 వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన గుడిమెట్ల వెంకట రెడ్డి ఏకగ్రీవంగా నిలిచారు. మార్టేరులో 14 వార్డులో ఇరువురు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులే పోటీలో నిలిచారు. వీరిలో కప్పల అనంతలక్ష్మీ 138 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో టీడీపీ బలపరిచిన కుడిపూడి వరప్రసాద్ వైఎస్సార్ సీపీ బలపరిచిన పితాని సురేష్‌పై 43 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.

కే బేతపూడిలో..

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామాల్లో ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో మిగిలిన వారు ఉపసంహరించుకోవడంతో వైఎస్సార్ సీపీ మద్దత్తుదారైన కటికెల ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా గెలిచిన ధనలక్ష్మిని గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్నికైన వార్డు సభ్యురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఆగర్తిపాలెం సర్పంచ్‌గా కావలి లక్ష్మీకుమారి (స్వతంత్ర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశ్వనాథం పేరయ్య, దగ్గులూరు (వైఎస్సార్ సీపీ), కొప్పినీడి కృష్ణవేణి, వెలివెల (వైఎస్సార్ సీపీ), మన్నె మోహన్‌రావు, దిగమర్రు (స్వతంత్ర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతపర్రు 6వ వార్డు సభ్యునిగా అంగర రామలక్ష్మి, వైఎస్సార్ సీపీ తన సమీప అభ్యర్థి టీడీపీకి చెందిన గూడవల్లి వెంకటరమణపై 10 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అలాగే గోరింటాడ 6వ వార్డు సభ్యుడిగా వైఎస్సార్ సీపీకి చెందిన పీతల యామిని దుర్గా చంద్రకళ తన సమీప ప్రత్యర్థి చవ్వాకుల మణి ప్రియాంకపై 14 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: దొడ్డిపట్ల సర్పంచ్‌గా చెల్లుబోయిన ప్రమీలకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2021లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఆమె భర్త చెల్లుబోయిన నరసింహారావు (పండు) వైఎస్సార్ సీపీ తరపున సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా ఎన్నికైన ఏడాది కాలానికే పండు అనారోగ్యంతో మరణించారు. దీంతో పండు భార్య ప్రమీలకుమారిని గ్రామస్తులంతా ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అలాగే కాంభొట్లపాలెం పంచాయతీ 4వ వార్డు సభ్యునిగా తెలుగుదేశం పార్టీ తరపున బొక్కా రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ వార్డు సభ్యుడు పితాని సత్యనారాయణ అనారోగ్యంతో మరణించడంతో ఇక్కడ ఎన్నిక అనివార్యమైంది.

సీఎం జగన్ పాలనను స్వాగతిస్తున్న ప్రజలు


వార్డు సభ్యులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు స్వాగతిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు, గోరింటాడ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో విజయం సాధించిన అంగర రామలక్ష్మి, పీతల యామిని దుర్గా చంద్రకళ ఆదివారం ఏఎంసీ అతిథి గృహంలో గోపిని కలిసిన సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు దారులను ప్రజలు గెలిపించారన్నారు. గత నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను అమలు చేశారన్నారు. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందనున్నాయన్నారు. 2024లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ప్రమాణస్వీకారం చేయనున్నారని గోపి జోస్యం చెప్పారు. సమావేశంలో పట్టణ, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం మైఖేల్‌రాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, చింతపర్రు, గోరింటాడ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్–1 విజేత అభిషేక్‌కు సత్కారం


అభిషేక్‌కు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

పాలకొల్లు సెంట్రల్: నేటి యువతరం అంతా సాఫ్ట్‌వేర్ రంగాన్నే ఎన్నుకుంటున్నా అభిషేక్ మాత్రం గ్రూప్స్‌కు ప్రిపేరై విజయం సాధించడం మన క్షీరపురికే గర్వకారణమని వైఎస్సార్ పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు అన్నారు. ఆదివారం స్థానిక అచ్చుగట్లపాలెం ప్రజలు గ్రూప్ 1 విజేత రావూరి రామ వెంకట సదా సాయి అభిషేక్‌కు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణంలో ఇప్పటివరకూ గ్రూప్ 1లో విజయం సాధించిన వ్యక్తి అభిషేక్ కావడం అభినందనీయమని అన్నారు. పాలకొల్లుకు సినీ, నాటక రంగాల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని అన్నారు. ఏపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అభిషేక్ పాలకొల్లుకు మరోసారి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అభిషేక్‌ను, అతని తల్లిదండ్రులు రావూరి చాచా, శ్రీదేవిలను అభినందించారు. అనంతరం అభిషేక్‌ను ఘనంగా సన్మానించి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులు, చేగొండి సూర్యప్రకాష్, చేగొండి సూరిబాబు, కుంపట్ల చిన్నరాజా, బొర్రా శ్రీనివాసు, మండెల రజని, వంగా నరసింహరావు, కత్తుల రామ్మోహనరావు, అడ్డాల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం కుటుంబ కలహాలతో కొట్లాడుకోవడంతో ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గొల్లవాని తిప్ప గ్రామానికి చెందిన మద్ది విజయలక్ష్మికి నలుగురు కొడుకులు ఉండగా వారందరికీ వివాహాలయ్యాయి. ఇంట్లో నాలుగు పోర్షన్లలో ఉండగా వాటికి ఒకే బాత్‌రూమ్ ఉంది. దీంతో పెద్దకుమారుడు మద్ది విజయ శేఖర్ పిల్లలు బాత్‌రూమ్‌లోకి వెళ్లగా ఎంతసేపటికి రాకపోవడంతో మద్ది వేణుగోపాల్ వారిపై కేకలు వేసి చీపురు కట్టతో మద్ది విజయలక్ష్మిని కొట్టి గాయపరిచాడని ఆమె ఫిర్యాదు చేసింది. మద్ది చంద్రకళను అన్యాయంగా మద్ది విజయ శేఖర్ కొట్టి గాయపరిచాడని ఇద్దరూ ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదులపై ఎస్సై బి.మోహన్‌రావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మేంటీవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో ఈ నెల 22న పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, మానవతా తదితర స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. ఇతర వివరాల కోసం 99490 93115, 9440859700 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

వ్యవసాయం, ఆక్వాకు అధిక ప్రాధాన్యం


చినపుల్లేరులో వంతెన ప్రారంబిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: వ్యవసాయం, ఆక్వా సాగుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం చినపుల్లేరు శివారు మంగలకోడుపై రైతులు స్వచ్ఛందంగా రూ.10 లక్షలతో నిర్మించుకున్న వంతెనను రైతుల కోరిక మీదట పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి, ఆక్వాకు మద్దతుగా నిలిచి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రైతుకు నష్టం కలిగితే వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందు ఉంటోందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 సాయం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు, ఇతర పెద్దమనుషుల హేళనగా మాట్లాడినా రైతులకు వ్యవసాయం పండగ చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. రైతులకు తక్కువ ధరకు ఎరువులు, పురుగుమందులు గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. సబ్సిడీపై విత్తనాలు, విపత్తు సమయాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం వంటివి పూర్తిస్థాయిలో అందిస్తోందన్నారు. అలాగే పూర్తి స్థాయిలో పంటకు మద్దతు ధరను అందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఆక్వా సాగుకోసం నడుంబిగించి కరోనా కష్ట సమయంలో రైతులకు అండగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని రైతులు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. సీడ్ ధరలు తగ్గించి, నాణ్యమైన సీడ్ అందించడం, కౌంట్ ధరలు పెంచడం వంటివి చేసి గత కరోనా కాలం నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుకు అండగా నిలిచిందన్నారు. ముఖ్యంగా పదెకరాలలోపు రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను సబ్సిడీపై అందించి వారికి మరింత దన్నుగా నిలిచిందన్నారు. గ్రామ సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మ, పెన్మత్స రామరాజు, కాళ్ల జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, బొండాడ సర్పంచ్ గోళ్ళ పండు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు బొర్రా వెంకన్న (తాతయ్య), బొర్రా సుబ్బారావు, బొర్రా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన


ఆకివీడులో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఆకివీడు: ప్రేమించి, పెళ్లి చేసుకున్న భార్యను అత్యంత కిరాతకంగా చంపిన వాడపల్లి రాంబాబును ఉరి తీయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మహిళలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దుంపగడప గేటు వద్ద నుంచి మహిళలు, వివిధ పార్టీల నాయకులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ అతి కిరాతకంగా భార్య సంధ్యను చంపిన హంతకుడు రాంబాబును ఉరి తీయాలని ఆమె డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి అండగా ఉండాలని, న్యాయం జరిగే వరకూ పోరాడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, పుప్పాల పండు, ఎండీ మస్తాన్‌వలీ, షేక్ హుస్సేన్, గుండా సుందరరామనాయుడు, ఎండీ మాబూ, రంభ శివ, సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, బొక్కా వర్మ, డోకల సత్యవతి, సందక సూర్యకుమారి, డోకల రవితేజ, రాంబాబు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

దిగివచ్చిన టమాటా ధర

పాలకోడేరు: సామాన్యుడికి టమాటా ధరలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలోని మోగల్లు, శృంగవృక్షం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన వారపు సంతలో ఈ వారం కూరగాయలు ధరలు సామాన్యుడికి అందుబాటులోనే ఉన్నాయి. నిన్నటి వరకు కిలో రూ.160 నుంచి రూ.200 వరకు ధర పలికిన టమాటాలు ఆదివారం కిలో రూ.50కి ధర పడిపోయింది. దీంతో కొనుగోలుదారులు టమాటాల కోసం ఎగబడ్డారు.